క్లుప్తంగా

కత్తెర పురుగుతో తీవ్ర నష్టం



ఉదయగిరి: మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు తీవ్రనష్టం కలిగిస్తుందని ఏఓ అంజనేయులునాయక్ తెలిపారు. మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. మొక్కజొన్న, సజ్జ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మొక్కజొన్నలో కత్తెర పురుగును గుర్తించి నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5జీ 200 గ్రాములను ఒక హెక్టారుకు పిచికారీ చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఆత్మకూరు: ఆత్మకూరు-బట్టేపాడు మార్గంలోని వెంకయ్య స్వామి ఆశ్రమం సమీపంలో గురువారం మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వస్తున్న ఆత్మకూరు సీఐ గంగాధర్ గమనించి 108 వాహనంలో క్షతగాత్రుడ్ని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్సీ



కావలి: మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కొద్దిసేపు వివిధ అంశాలపై చర్చించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ సమీపంలో అన్న క్యాంటీన్‌ను గురువారం ప్రారంభించారు. తొలుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని ముమ్మర ప్రచారం నిర్వహించారు. మంత్రి రాకపోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఐవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ రూరల్ ఏఈ సస్పెన్షన్

ఆత్మకూరు: విద్యుత్ శాఖ ఆత్మకూరు రూరల్ ఏఈ వెంకటేశ్వర్లును జిల్లా ఎస్‌ఈ సస్పెండ్ చేసినట్లు ఆత్మకూరు డీఈ జనార్దన్‌రావు గురువారం తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అవకతవకలకు పాల్పడినట్లు ఏఈపై ఆరోపణలు రావడంతో జిల్లా విద్యుత్ శాఖ అధికారులు విచారణ చేపట్టారని చెప్పారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేశారని డీఈ తెలిపారు.

సీఎం సహాయ నిధికి రూ.8,43,310 విరాళం



ఆత్మకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థంగా సీఎం సహాయనిధికి ఆత్మకూరు డివిజన్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (అపస్మా) రూ.8,43,310 నగదును విరాళంగా అందజేసింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర అపస్మా సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఎంవీ సుబ్బారెడ్డికి నెల్లూరులో గురువారం అందజేశారు. ఆత్మకూరు డివిజన్‌కు చెందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు భారీ మొత్తంలో నగదు విరాళంగా అందించడంపై సుబ్బారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో అపస్మా కార్యవర్గ సభ్యులు ఎం కృష్ణారెడ్డి, సీహెచ్‌వీ రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, డీ వెంకటసుబ్బయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు రాయితీలు

చేజర్ల: ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ఉపాధి హామీ పథకం కింద రాయితీలు అందజేస్తున్నట్లు డ్వామా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఏటూరు సచివాలయంలో ఉపాధి పనులపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఉద్యాన పంటలతో పాటు సన్నకారు రైతులకు రాయితీలను అందిస్తున్నట్లు వివరించారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీల జోరు.. ప్రజలు బేజారు

పట్టణంలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీల ఏర్పాటు

- అనుమతుల్లేకున్నా పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- మున్సిపల్ ఆదాయానికి గండి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



మున్సిపల్ కార్యాలయం వద్ద అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



మున్సిపల్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ఫ్లెక్సీలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ నాయకుల పర్యటనలు..పుట్టినరోజు..పెళ్లిరోజు వేడుకలు..పండగలకు శుభాకాంక్షలు..ఇలా మున్సిపల్ అనుమతుల్లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. తెల్లారేసరికి రోడ్లపై వెలుస్తున్న ఫ్లెక్సీలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు.రాజకీయ నాయకుల మెప్పు పొందేందుకు వారి అనుచరులు, కార్యకర్తలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలతో ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో ప్రజలు బేజారెత్తుతున్నారు.

ఎక్కడ పడితే అక్కడ

మున్సిపల్ పరిధిలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరుపాళెం సెంటర్ మొదలు బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ఎల్ఆర్‌పల్లి, పోలీసు స్టేషన్ సమీపంలోని సోమశిల రోడ్డు సెంటర్, బీఎస్సార్ సెంటర్, ప్రియదర్శిని నగర్ సెంటర్, సత్రం సెంటర్, హిల్‌రోడ్డు, ఇలా చెప్పుకుంటూ పోతే పట్టణంలో ఫ్లెక్సీలు లేని ప్రాంతమే లేదంటే అతిశయోక్తికాదు. రోడ్డు డివైడర్‌లోని విద్యుత్ స్తంభాలను సైతం వదలకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఫ్లెక్సీలు గాలులకు కూలి ప్రజలు గాయాలపాలవుతున్నారు.

చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

మున్సిపల్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ అధికారుల అనుమతులు తప్పనిసరి. మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకుని నిర్దేశించిన రుసుం చెల్లించి అనుమతులు పొంది ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను పాటించకుండానే మున్సిపల్ పరిధిలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది.

హైకోర్టు ఉత్తర్వులు అమలయ్యేనా?

ఇటీవల మున్సిపాలిటీల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను తొలగించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని హైకోర్టు తీర్పు ఇచ్చింది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగులతో ప్రమాదాలకు తోడు నగర శోభ దెబ్బతింటోందని వ్యాఖ్యానించింది. ఇక నుంచి నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని, చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఏ మేరకు అవి అమలవుతాయో వేచి చూడాల్సిందే.



పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



డివైడర్ మధ్యన వీధి దీపాల స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

అనుమతుల్లేని ఫ్లెక్సీలను తొలగిస్తాం

మున్సిపల్ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించా. పట్టణంలో పరిశీలించి అనుమతుల్లేని ఫ్లెక్సీలు, హోరింగులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇకపై అనుమతులతో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు చార్జీలు వసూలు చేస్తాం.

–గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్

అట్టహాసంగా స్కూల్‌గేమ్స్ ప్రారంభం



ఆత్మకూరులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



సంగంలో..

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్ -14, 17 స్కూల్ గేమ్స్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి హెచ్ఎం అనంతలక్ష్మితో కలిసి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, చెస్, యోగా, కబడ్డీ, తదితర పోటీలను నిర్వహించారు. రెండ్రోజుల పాటు నిర్వహించే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు పీడీలు తిరుపతయ్య, సురేష్ తెలిపారు. కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్-14,17 స్కూల్‌గేమ్స్ పోటీలను ఎంఈఓ మల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ప్రారంభించారు. తొలిరోజు పీడీ అంకయ్య ఆధ్వర్యంలో పరుగుపందెం, షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, జావలిన్, హైజంప్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ పోటీలను గురువారం ప్రారంభించారు. అండర్-14-17 విభాగాల్లో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలలకు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం కబడ్డీ, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, శనివారం ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలను నిర్వహించనున్నారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎం మాలకొండయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఎం తిరుపాల్‌రెడ్డి, ఆర్ అంజయ్య, ఎం.సుమలత, వీ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా గండిపాళెం గురుకుల పాఠశాలలో శుక్ర, శనివారాల్లో క్రీడాకారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ జీడీ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకనబరిచిన వారిని నియోజకవర్గస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.



మర్రిపాడు: విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మర్రిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన 110 మంది క్రీడాకారులకు సాహో ఫౌండేషన్ నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంఈఓ ధనలక్ష్మి మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. హెచ్ఎం పద్మలత, సాహో ఫౌండేషన్ సభ్యులు జొన్నా సత్యనారాయణ, రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు



కావలి: బుడంగుంటకాలనీలో వినాయక చవితి ఉత్సవాల్లో జరిగిన చిన్నపాటి గొడవకు సంబంధించి కావలిరూరల్ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమకు న్యాయం చేయడంలేదని బాధితురాలు షేక్ సోనీ ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వినాయక చవితిఉత్సవాల సందర్భంగా చిన్నపాటి గొడవ జరిగిందని, తమపై న్యాయవాది జయలక్ష్మి, ఆమె అనుచరులు నరేష్, ఉషారాణి, శారద దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. అనంతరం తమ మీదే కేసు నమోదు చేయించి తన భర్తను అన్యాయంగా జైలుకు పంపించారని విలపించారు. కావలి రూరల్ పోలీసులు న్యాయవాది అనే భావంతో జయలక్ష్మి వైపే మాట్లాడుతూ తమపైన కేసులు నమోదు చేశారని, తాము ఇచ్చిన ఫిర్యాదులను తీసుకోలేదని ఆరోపించారు. మేము చదువుకున్న వాళ్లం కాదని, ఏమైనా తప్పులు ఉంటే మమ్మల్ని మన్నించి న్యాయవాది నుంచి కాపాడాలని, తమ ఫిర్యాదులను స్వీకరించి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కుటుంబ సభ్యులు తాళ్లూరు నాగమణి, నల్లగండ్ల కిషోర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



ఆత్మకూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీలత



అల్లూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

ఆత్మకూరు: పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీలతో సమీక్ష సమావేశం, పౌష్టికాహార మాసోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు రత్నమ్మ, నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అవగాహన కల్పించారు. 11 నుంచి 17 ఏళ్లలోపు బాలికలు రక్తహీనతకు గురికాకుండా సమతుల ఆహారం, పిండి పదార్థాలు, మాంసకృతులు, ఖనిజలవణాలు, విటమిన్లు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

ఎంఈఓ తనిఖీలు

ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 చలపతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులు తుమ్మల గంగాధర్‌రెడ్డి, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన

ఉదయగిరి: కృష్ణంపల్లి సచివాలయం పరిధిలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య విద్యా బోధకుడు కే వెంకటసుబ్బయ్య పరిశీలించి సూచనలు చేశారు. వయోజనుల్లో క్షయ వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని తెలిపారు. వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయగిరి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ బోగ్యం వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది జ్యోతిష్యారాణి, ఎస్‌కే జమీలా, ఎస్కే షర్మిల, చంద్రమౌళి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

కావలి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కావలి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

వాహనాల తనిఖీ

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీఐ వేమారెడ్డి గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎస్సై షేక్ జిలానీ, వేణుగోపాల్ నాయుడు

ఆత్మకూరురూరల్: కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులకు గార్లపాటి ఫౌండేషన్ అధినేత గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు రూ.50వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను గురువారం అందజేశారు. ఆత్మకూరు ఎస్సై షేక్ జిలానీ చేతుల మీదుగా 12 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గార్లపాటి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ తరుపున కరటంపాడు ఉన్నత పాఠశాలలో ప్రతిభచూపిన పదో తరగతి విద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలిపారు. హెచ్ఎం మాలకొండలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పూనుగుంట రేవతి, మాజీ సర్పంచ్ సాబ్‌జాన్, స్థానిక నాయకులు దావా పెంచలరావు, హనీఫ్, ఉపాధ్యాయులు పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే తొలి ప్రాధాన్యత

- కావలి డీఎస్పీ పీ శ్రీధర్



మాట్లాడుతున్న కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి: కావలి డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే తొలి ప్రాధాన్యతగా విధులు నిర్వహించడానికి కృషి చేస్తామని కావలి నూతన డీఎస్పీ పీ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రౌడీయిజం, గుండాయిజంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మత్తు పదార్థాల అమ్మకాలు, కొనుగోళ్లపై నిఘా ఉంచి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాసంస్థల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వాటికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తామన్నారు. బైక్‌లకు సైలెన్సర్లను తొలిగించి నడిపే వారిని గుర్తించి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శ



ఆస్పత్రిలో రంగయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: కావలి పట్టణంతో పాటు బోగోలు, దగదర్తి మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రామిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అలాగే బోగోలు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పర్రి అంకులయ్య, తాళ్లూరుకు చెందిన గోత్తల శేషయ్య అనారోగ్యంతో చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటుండగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఇటీవల తల్లిని పోగొట్టుకున్న దగదర్తి మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు వెలినేని మహేష్‌నాయుడును బోడిగుడిపాడులోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఆశీర్వాదం

ఇటీవల దగదర్తి మండలం నారాయణపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు వట్టికాళ్ల తిరుపతయ్య మనవరాలు, బోగోలు మండలం తాళ్లూరు నాయకుడు ఏసుపోగు బాలచంద్ర కుమార్తె వివాహాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వారి ఇళ్లకు వెళ్లి నూతన దంపతులను రామిరెడ్డి ఆశీర్వదించారు.

విద్యార్థినికి అభినందన

కావలి పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేగా కృష్ణారెడ్డి కుమార్తె యోగిత పీజీ మెడిసిన్‌లో రాష్ట్ర స్థాయిలో 57వ ర్యాంకు సాధించారు. ఈ నేపథ్యంలో విద్యార్థిని నివాసానికి వెళ్లి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన వెంట కావలి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘుయాదవ్, తదితరులు ఉన్నారు.

గ్రీన్‌కో ఫౌండేషన్ దాతృత్వం



చేజర్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రీన్‌కో ఫౌండేషన్ వారు స్పోర్ట్స్ కిట్లు, వాటర్ డిస్పెన్సరీలను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఏజీఎం బాషా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు తమ వంతుగా స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేశామని తెలిపారు. విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చడానికి వాటర్ డిస్పెన్సరీలను అందజేశామన్నారు. గ్రీన్‌కో ప్లాంట్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ నరేంద్ర, అకౌంటెంట్ పూర్ణచంద్ర,హెచ్ఎం హైమావతి, ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, పీడీ మల్లికార్జున పాల్గొన్నారు.

అకాల వర్షంతో ప్రయాణికుల ఇక్కట్లు



ఆత్మకూరురూరల్: మండలంలోని నెల్లూరుపాళెం -గొల్లపల్లి మధ్యన గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్న వేళ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. దీంతో 67వ నంబరు జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు తడిచి ముద్దయ్యారు. బస్‌షెల్టర్‌లో తలదాచుకుని వర్షం నిలిచిన తరువాత రాకపోకలు కొనసాగించారు. కాగా నెల్లూరుపాళెం -గొల్లపల్లి మధ్యలో తప్ప జాతీయ రహదారి వెంబడి ఎక్కడా వర్షం పడకపోవడం విచిత్రం.

సంద్రంలో అలజడి



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన మత్స్యకారుడు పోలయ్య. చేతి తెడ్డుతో తెప్పపై సముద్రంలో చేపలు వేట చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటాడు. ఇటీవల పదిరోజులుగా ఎంతో ఆశతో సముద్రంలో వేటకు వెళ్లినా వలకు చేపలు పడలేదు. సముద్రంలో వేసిన వలలో చేపలు చిక్కకపోగా, వల చిక్కులు పడింది. ఒడ్డుకు చేరుకుని వల చిక్కులను తీసుకుంటున్నాడు. సముద్రంలో ఏదో జరగబోతోందని అతను వాపోతున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది తుమ్మలపెంట గ్రామంలోని సముద్ర తీరం. ఇటీవల సముద్రంలో చోటు చేసుకున్న అనూహ్య పరిణామాల క్రమంలో సముద్రం 50 మీటర్లు ముందుకొచ్చింది. ఒడ్డు వద్ద భారీగా ఇసుక మేట వేసింది. ప్రస్తుతం ఒడ్డు నుంచి చూస్తే సముద్రం లోతులో ఉన్నట్లు కనిపిస్తోంది.

- మత్స్యకారుల ఆందోళన
- ఇటీవల సముద్రంలో మార్పులు
- ఒకేసారి 50 మీటర్లు ముందుకు
- కొద్ది సేపటి తర్వాత వెనక్కి

కావలి: మండలంలోని సముద్రతీరంలో జరుగుతున్న మార్పులతో తీరప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తుమ్మలపెంట, ఒట్టూరు గ్రామాల్లో సముద్రం ముందుకు రావటం, వెనక్కు పోవడం వంటి మార్పులు ఇటీవల సంభవించాయి. ఇలాంటి మార్పులు గతంలో ఎన్నడూ జరగలేదని మత్స్యకారులు చెబుతున్నారు. తుమ్మలపెంట గ్రామం వద్ద సముద్ర తీరం కోతకు గురైంది. ఇటీవల 50 మీటర్లు ముందుకు వచ్చింది. కొంత సేపటికి మళ్లీ వెనక్కి వెళ్లింది. అంతేకాదు సముద్రం రంగులో మార్పు కూడా సంభవించింది. గతంలో ఎప్పుడూ తుమ్మలపెంట వద్ద సముద్రం అంతగా ముందుకు రాలేదు. తుమ్మలపెంట, ఒట్టూరు, కొత్తసత్రం గ్రామాల వద్ద సముద్రంలో చోటుచేసుకుంటున్న అలజడి తీర ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తుమ్మలపెంట వద్ద తీరంలో ఉన్న బోట్లు, వలలు సముద్రం ముందుకు రావడంతో చెల్లాచెదురైపోయాయి. కావలి మండలం చిన్న రాముడుపాళెం, పెద్దరాముడుపాళెంతో పాటు, బోగోలు మండలంలోని తాటిచెట్లపాళెం, టెంకాయచెట్లపాళెం గ్రామాల వద్ద కూడా సముద్రంలో మార్పులు చోటుచేసుకున్నాయి. గత వారం ఒక్కసారిగా సముద్రంలో చోటు చేసుకున్న మార్పులు తీర ప్రాంత వాసులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏదైనా ఉపద్రవం ముంచుకు వస్తుందేమో అని మత్స్యకారులు భయపడుతున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని తీరం వెంబడి రాకాసి అలలు ఎగిసిపడ్డాయి. దీంతో సముద్రం ముందుకు వచ్చి తుమ్మలపెంట తీరంలోని మత్స్యకారుల వేట సామగ్రిని కెరటాలు తాకాయి. అనంతరం కొంత సేపటికి ఒక్కసారిగా సముద్రం కొన్ని మీటర్ల మేర వెనక్కి వెళ్లి పోయింది. అసలేం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కావలి రూరల్ మండలంలోని తీర ప్రాంతంలో సముద్రంలో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఈ చిత్రంలో కనిపించేవి చేతి తెడ్డుతో సముద్రంలో చేపల వేట చేసే తెప్పలు. ఇంజన్లు ఉండే ఫైబర్ బోట్లు సముద్రంలో ఇటీవల సంభవిస్తున్న అలజడులకు కొట్టుకుపోతాయని మత్స్యకారులు భయపడి వాటిని తీయడం లేదు. వాటిని సమీపంలో ఉన్న చిప్పలేరు వాగుకు తరలించి లంగరు వేసి కాపాడుకున్నారు.